

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

మెదక్ అర్బన్, మే 10 (ఆంధ్రజ్యోతి): మెదక్ రీజియన్ పరిధిలోని మెదక్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు రీజినల్ కోఆర్డినేటర్ గంగారామ్ నాయక్ తెలిపారు. ఈనెల 15న కామారెడ్డి గురుకుల, 16న చేగుంట బాలికల కళాశాలలో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని తెలియజేశారు.

సంగారెడ్డి జిల్లాలో 25 మంది

నకిలీ డాక్టర్లపై కేసులు

- ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే కఠిన చర్యలు
- టీజీఎంసీ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్
- జిల్లా వ్యాప్తంగా క్లినిక్‌లు, ఆస్పత్రుల్లో ఐదు బృందాలతో ముమ్మర తనిఖీలు



సంగారెడ్డిలోని ఓ క్లినిక్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న టీజీఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్

సంగారెడ్డి అర్బన్, మే 10 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో 25 మంది నకిలీ డాక్టర్లపై కేసుల నమోదుకు చర్యలు తీసుకోనున్నట్టు తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్(టీజీఎంసీ) వైస్ చైర్మన్ డా.శ్రీనివాస్ తెలిపారు. సంగారెడ్డిలోని ఐఎంఏ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీజీఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, సభ్యుడు ఎస్.ఆనంద్ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలోని మాల్యాపూర్, సదాశివపేట, సంగారెడ్డి, నర్సాపూర్, దౌల్తాబాద్, కంకోల్, ఇస్నాపూర్, జహీరాబాద్ ప్రాంతాల్లోని పలు క్లినిక్‌లు, ఆస్పత్రుల్లో ఐదు బృందాలు ఆకస్మిక తనిఖీలు చేసినట్టు వివరించారు. ఆయా క్లినిక్‌లలో కొందరు బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, డీఫార్మ్ విద్యార్హతలు కలిగిన వ్యక్తులు వైద్య మండలి గుర్తింపు లేకుండా మోడరన్ మెడిసిన్ ప్రాక్టీస్ చేస్తున్నారని, స్టెరాయిడ్లు, పెయిన్ కిల్లర్లు రాస్తూ ప్రజారోగ్యాన్ని హానికి గురిచేస్తున్నట్టు గుర్తించినట్టు పేర్కొన్నారు. కొన్ని క్లినిక్, ఆస్పత్రులు డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ అథారిటీ(డీఎంహెచ్‌వో)అనుమతి లేకుండా నడుస్తున్నట్టు వివరించారు. జాతీయ వైద్య మండలి చట్టం సెక్షన్ 34, 54 ప్రకారం ఇది తీవ్రమైన నేరమన్నారు. ఎలాంటి విద్యార్హత లేకుండా నకిలీ డాక్టర్లుగా చెలామణి అవుతూ మూడుసార్లు పట్టుబడితే పీడీ యాక్టు కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. నకిలీ వైద్యులపై మెడికల్ కౌన్సిల్ కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. తనిఖీలో గుర్తించి ఆధారాల ఆధారంగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయిస్తామని తెలిపారు. తనిఖీల నివేదికకు జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు సమర్పించనున్నట్టు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఎథిక్స్ కమిటీ చైర్మన్ కిరణ్‌కుమార్, టీజీఎంసీ మెంబర్లు విష్ణు, సన్నీడేవీస్, రాజీవ్, హారిక, శిరీష్, ఐఎంఏ డాక్టర్లు చక్రపాణి, హరికుమార్‌గౌడ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో పాలన పడకేసింది. పట్టించుకునే వారు లేక వీధులు చెత్త కుప్పలను తలపిస్తున్నాయి. నిధులు రాక చెత్త సేకరణ ట్రాక్టర్లలో డీజిల్ పోసే పరిస్థితి లేదు. పంచాయతీ కార్యదర్శులు సొంత డబ్బులు వెచ్చించి అత్యవసర సేవలను కొనసాగించినా బిల్లులు రాక పోవడంతో చేతులెత్తేశారు. గతేడాది డిసెంబరులో నిర్వహించిన 'పచ్చదనం- స్వచ్ఛదనం' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా ట్రెజరీ కార్యాలయంలో ఆ చెక్కులు చెల్లుబాటు కావడం లేదు. పన్నుల రూపంలో ప్రజలు చెల్లించిన నిధులు కూడా ఉపయోగించుకుందామంటే రాష్ట్ర ప్రభుత్వం ఫ్రీజింగ్ విధించిందని ట్రెజరీ అధికారులు బదులిస్తున్నారు.


కందిలో డీజిల్ లేక వృథాగా ట్రాక్టర్

డీజిల్‌కూ పైసల్లేవ్..!

మూలనపడిన చెత్త సేకరణ ట్రాక్టర్లు


నర్సాపూర్ మండలం పెద్ద చింతకుంటలో మరమ్మతులకు డబ్బులు లేకపోవడంతో మూలనపడ్డ పంచాయతీ ట్రాక్టర్

- భారంగా మారిన నిర్వహణ
- ఈఎంఐలు చెల్లించలేని దుస్థితి
- గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం
- పంచాయతీ కార్యదర్శులపైనే భారం

మెదక్/సంగారెడ్డి టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో 633, మెదక్ జిల్లాలో 493 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. సర్పంచుల పదవీకాలం 2024 ఫిబ్రవరితో ముగిసింది. నాటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. మూడు, నాలుగు పంచాయతీలకు ఒక ప్రత్యేకాధికారిని కేటాయించారు. 14 నెలలుగా ప్రత్యేక పాలన సాగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన గ్రాంట్లు విడుదల కావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎఫ్‌సీ నిధులు మంజూరు చేయడం లేదు. కేంద్రం నుంచి రావాల్సి 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు ఆగిపోయాయి. దీంతో పంచాయితీల నిర్వహణ భారం కార్యదర్శులపై పడింది. మొదట్లో పంచాయతీ కార్యదర్శులు సొంత డబ్బులు వెచ్చించి అత్యవసర సేవలను కొనసాగించారు. కానీ, ఏడాది గడిచినా గ్రామాల్లో చేపట్టిన పనులకు బిల్లులు రాకపోవడంతో వారు చేతులెత్తేశారు.

నిరుపయోగంగా ట్రాక్టర్లు

గత ప్రభుత్వం పారిశుధ్య నిర్వహణ కోసం గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లు అందజేసిన విషయం తెలిసిందే. 2020లో అప్పటి సర్కార్ నిర్ణయం మేరకు ప్రతీ గ్రామ పంచాయతీ బ్యాంకు రుణం ద్వారా ట్రాక్టర్లు కొనుగోలు చేసింది. రుణ వాయిదాలను పంచాయతీలకు వచ్చే నిధుల నుంచి చెల్లించాలని ఆదేశాలిచ్చారు. అప్పటి నుంచి చెత్త సేకరణ, తాగునీటి సరఫరా, నర్సరీల్లో మొక్కల పెంపకం.. తదితర పనులకు వీటిని ఉపయోగించుకుంటున్నారు. కానీ, ప్రత్యేక పాలనలో నిధులు రాకపోవడంతో గ్రామ పంచాయతీల్లో ట్రాక్టర్ల నిర్వహణ భారంగా మారింది. మరమ్మతులు, డీజిల్, డ్రైవర్లకు వేతనాలకు సైతం నిధులు లేకపోవడంతో ట్రాక్టర్లు మూలనపడ్డాయి. దీంతో చెత్త సేకరణ నిలిచిపోయింది. సొంత ఆదాయం ఉన్న అతికొద్ది పంచాయతీల్లో మాత్రమే ట్రాక్టర్ల నిర్వహణ కొనసాగుతున్నది. చిన్న, కొత్త పంచాయతీలు, తండాల్లో పారిశుధ్యం పడకేసింది.


నాగల్‌గిద్ద మండలం షికార్‌ఖాన గ్రామంలో పంచాయతీ ట్రాక్టర్ ట్రాలీ

సంగారెడ్డి జిల్లాలో...

- పుల్కల్ మండలంలోని రాయిపాడ్, ముద్దాయిపేట, బస్వాపూర్, మిన్‌పూర్ తండా, లాల్‌సింగ్‌నాయక్, హన్మానాయక్ తండా, గొంగ్లూరు గిరిజన తండాలతో పాటు చౌటకూర్ మండలంలోని బద్రిగూడెం, ఉప్పరిగూడెం, తాడ్దానిపల్లి, గంగోజిపేట, చక్రియాల, లింగంపల్లి, వెంకటకిష్టాపూర్, వెండికోలు, సరాఫపల్లి, పోసానిపల్లి, బొమ్మారెడ్డిగూడెం తదితర పంచాయతీల్లో డీజిల్‌కు డబ్బులు లేక చెత్త సేకరణ పక్షం రోజులుగా నిలిచిపోయింది. మిగిలిన పంచాయతీల్లోనూ కార్యదర్శులే సొంత డబ్బులు వెచ్చించి డీజిల్ పోయిస్తున్నారు.
- నాగల్‌గిద్ద మండలం షికార్‌ఖాన గ్రామంలో పంచాయతీ ట్రాక్టర్ డీజిల్‌కు డబ్బుల్లేక 15 రోజులకోసారి చెత్తను సేకరిస్తున్నారు.
- నారాయణఖేడ్ మండలం సీతారాం తండా మినహా అన్నీ గ్రామ పంచాయతీల్లో ట్రాక్టర్లకు పంచాయతీ కార్యదర్శులే డీజిల్ పోస్తున్నారు. నాలుగు రోజులకోసారి చెత్తను తొలగిస్తున్నారు.
- కంది మండలంలోని 22 పంచాయతీల్లో ట్రాక్టర్ల డీజిల్‌కు డబ్బుల్లేక నీటి ట్యాంకర్ల సరఫరా, పారిశుధ్య నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- మునిపల్లి మండలంలోని 30 పంచాయతీల్లో సగానికిపైగా కార్యదర్శులే డీజిల్ పోయిస్తుండగా బిల్లులు రాకపోవడంతో కొన్ని రోజులుగా చేతులెత్తేశారు. దీంతో చెత్త సేకరణ నిలిచిపోయింది.
- అందోలు మండల పరిధిలో రెండు, మూడు

మిగతా 8వ పేజీలో..



జహీరాబాద్‌లో పేరుకే వందపడకల ఆస్పత్రి

ఏడాదిగా దవాఖానా అభివృద్ధిపై సమీక్ష కరువు
మొక్కుబడిగా వైద్యం.. అత్యవసర సేవలకు దూరం
రోజుకు సుమారు వెయ్యి మంది ఔట్‌పేషెంట్లు
క్యాంటీన్ లేక రోగుల బంధువులు, సహాయకులు పస్తులు

8లో



నాలుగు దశాబ్దాలుగా గుడిసెల్లోనే..!

వివిధ ప్రాంతాల నుంచి కొత్తపేట గ్రామానికి వలస
కనీస సౌకర్యాలకూ నోచుకోని గంగిరెద్దుల కుటుంబాలు
ఏళ్లుగా విద్యుత్ సౌకర్యం లేక చీకట్లోనే జీవనం
40 కుటుంబాల్లో ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్లు

7లో


హత్నూరలోని కొనుగోలు కేంద్రం వద్ద వడ్ల కుప్పలు

లక్ష్యం 2.07 లక్షల మెట్రిక్ టన్నులు

కొన్నది 32,572 టన్నులు

- ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు
- సంగారెడ్డి జిల్లాలో 216 కేంద్రాలు
- 72 గంటల్లో చెల్లింపులు ఉత్తదే

సంగారెడ్డి టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో వారం రోజులుగా ధాన్యం సేకరణ జోరందుకున్నది. నెల రోజుల క్రితమే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ కోతలు ఇటీవలే ఊపందుకున్నాయి. యాసంగి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 96,850 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు లెక్కలు తేల్చారు. 89,102 ఎకరాల్లో దొడ్డు రకం, 7,748 ఎకరాల్లో సన్నాలు సాగు చేస్తున్నట్లు గుర్తించారు. 2,07,456 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రావచ్చని అంచనావేశారు. 1,93,677 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, 13,779 మెట్రిక్ టన్నుల సన్న రకం వడ్లు సేకరించాలని నిర్ణయించారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 216 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఐకేపీ ద్వారా 107, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో 91, డీసీఎంఎస్ కింద 18 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.

జోరందుకున్న కోతలు

జిల్లాలో వరి కోతలు ఊపందుకున్నాయి. కొనుగోలు కేంద్రాలకు వడ్లు పోటెత్తుతున్నాయి.


హత్నూరలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని తూకం వేస్తున్న సిబ్బంది

ఇప్పటివరకు రూ.75.57 కోట్ల విలువ చేసే 32,572 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినా, 26,999 మెట్రిక్ టన్నుల ధాన్యం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. రైతులకు రూ. 62.62 కోట్లు కావాల్సి ఉండగా రూ.33.84 కోట్లు మాత్రమే ఖాతాల్లో జమయ్యాయి.

72 గంటల్లో చెల్లింపులు ఉత్తదే

ధాన్యాన్ని కొనుగోలు చేసిన 72 గంటల్లోగా రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామని సర్కార్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, 20 రోజుల క్రితం కొన్న వడ్ల డబ్బులు కూడా రాలేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం నుండి చెల్లింపులు ఆలస్యం కావడంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. దళారులు నేరుగా పొలాల వద్దనే పచ్చి వడ్లు కొనుగోలు చేసి అప్పటికప్పుడూ నగదు చెల్లిస్తుండటంతో అనేకమంది రైతులు వారికే విక్రయిస్తున్నారు. మరోవైపు కొనుగోలు కేంద్రాల్లో 40 కిలోల బస్తాకు రెండు నుంచి నాలుగు కిలోల వరకు తరుగు తీస్తున్నారన్న ఆరోపణలున్నాయి. క్వింటాలుకు 8 కిలోల వరకు తరుగు పేరిట దోపిడీ చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సౌకర్యాలు కరువు

ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ధాన్యం తీసుకువచ్చిన రైతులకు తాగునీరు, నీడ తదితర సౌకర్యాలు కల్పించడంలో నిర్వహకులు విఫలమయ్యారు. కోసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు కల్లాలు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఎక్కడపడితే అక్కడ ఖాళీ స్థలాలు, రోడ్లు, జాతీయ రహదారులపై ఇష్టానుసారంగా ఆరబెట్టాల్సిన పరిస్థితి నెలకొన్నది.

3,630 మంది టీచర్లు..

మూడు విడతల శిక్షణ

13వ తేదీ నుంచి షురూ

విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల పెంపునకు దోహదం

సంగారెడ్డి అర్బన్, మే 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాల పెంపునకు పాఠశాల విద్యాశాఖ కార్యాచరణ రూపొందించింది. ఈమేరకు ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. సంగారెడ్డి జిల్లాలో 3,630 మంది టీచర్లకు మూడు విడతల్లో శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది. ఈ నెల 13 నుంచి 17 వరకు మొదటి విడత, 20 నుంచి 24 వరకు రెండో విడత, 27 నుంచి 31 వరకు మూడో విడత శిక్షణ నిర్వహించనున్నారు. జిల్లావ్యాప్తంగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు 168 మంది డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ల(డీఆర్‌పీ)ను నియమించారు. రాష్ట్రస్థాయిలో వీరికి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని 10 పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల వారీగా శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు బోధనలో మెలకువలు నేర్చుకునేలా శిక్షణ ఇవ్వనున్నారు. బోధనలో నాణ్యతను పెంచడంతో పాటు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచేలా బోధించే నైపుణ్యాల పెంపునకు శిక్షణ దోహదం చేయనుంది.

నిందితులకు శిక్ష పడినప్పుడే

పోలీసులపై నమ్మకం పెరుగుతుంది

ఎన్‌బీడబ్ల్యూ కేసులపై దృష్టిసారించాలి

ఎన్‌డీపీఎస్ కేసుల్లో నిందితులకు కఠిన శిక్ష పడేలా జాగ్రత్తలు తీసుకోవాలి

కోర్టు డ్యూటీ అధికారులతో సమీక్షా సమావేశంలో సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి క్రైం, మే 10 (ఆంధ్రజ్యోతి) : నిందితులకు న్యాయస్థానంలో శిక్ష పడేలా దర్యాప్తుచేసి, కేసును ఫైల్ చేసినప్పుడే పోలీసులపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని పోలీసు కార్యాలయంలో శనివారం ఆయన కోర్టు డ్యూటీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ కేసులో నిందితులకు శిక్ష పడేవిధంగా చూడాలన్నారు. తప్పు చేసిన వారు చట్టం నుంచి తప్పించుకోకుండా దర్యాప్తులో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాన్‌బెయిలబుల్ వారెంట్స్‌ను అమలు చేయాలని పేర్కొన్నారు. ఎన్‌డీపీయస్ కేసులలో నిందితులకు తప్పనిసరిగా శిక్ష పడేలా చూడాలన్నారు. సైబర్ నేరాల్లో రికవరీ చేసిన డబ్బును బాధితులకు అందేవిధంగా బ్యాంక్‌లతో సమన్వయం చేయాలని సూచించారు. ఈ నెల 14 వరకు జరగనున్న స్పెషల్ లోక్ అదాలత్‌లో రాజీ కుదుర్చుకోవడానికి అవకాశమున్న కేసులను పరిష్కరించుకునేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ శ్రీనివాస్‌రావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, కోర్టు లైజనింగ్ అధికారి సత్యనారాయణ, డీసీఆర్బీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు షీ టీమ్స్ రక్షణ


మహిళలు, విద్యార్థినులకు రక్షణ కోసం షీటీమ్స్ రక్షణగా ఉంటాయని ఎస్పీ పంకజ్ పేర్కొన్నారు. షీ టీం బృందాలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా సబ్ డివిజన్లవారీగా షీ టీబృందాలు స్కూళ్లు, కళాశాలలు, బస్ స్టాండ్‌లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో గస్తీ కాస్తూ ఆకతాయిల ఆగడాలక చెక్ పెడుతున్నాయన్నారు. షీ టీమ్ ఫిర్యాదుల కోసం క్యూఆర్ కోడ్ స్కానర్ విధానంపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.


సంగారెడ్డిలోని ఓ కేంద్రంలో టీజీఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా టీజీఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష

సంగారెడ్డి అర్బన్, మే 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల కోసం శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష సంగారెడ్డి జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. జిల్లావ్యాప్తంగా 16 కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరిగింది. 3,861 మంది అభ్యర్థులకు గానూ 3,371 మంది హాజరయ్యారు. 87.30 హాజరు శాతం నమోదైందని కో ఆర్డినేటర్ సురభి చైతన్య తెలిపారు.







చోరీ నిందితులకు జైలు

జోగిపేట రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : చోరీకి పాల్పడ్డ నిందితులకు జైలు శిక్ష విధించింది. ఎస్‌ఐ పాండు వివరాల ప్రకారం.. 2014లో అందోల్ మండలం నాదులాపూర్‌కు చెందిన శ్రీశైలం ఇంట్లో అదే గ్రామానికి చెందిన మన్నె శ్రీనివాస్, అర్రె పెంటోజీ, బోయిని పాండు చోరీకి పాల్పడగా పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. శనివారం జోగిపేట మున్సిఫ్ కోర్టు జడ్జి మహ్మద్ అసాదుల్లా షరీఫ్ ముగ్గురికి సంవత్సరం జైలు శిక్ష విధించారు. ఇందులో శ్రీనివాస్‌కు జైలు శిక్షతో పాటు రూ.500ల జరిమానా విధించారని ఎస్‌ఐ తెలిపారు.







నగల కోసమే మహిళ హత్య

- 24 గంటల్లోనే కేసును ఛేదించిన గజ్వేల్ పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ పురుషోత్తంరెడ్డి


గజ్వేల్‌లోని పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

గజ్వేల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : నగల కోసం మహిళను హత్యచేసిన నిందితురాలిని గజ్వేల్ పోలీసులు 24 గంటల్లో అరెస్ట్ చేసినట్లు గజ్వేల్ ఏసీపీ కె.పురుషోత్తంరెడ్డి తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని బాలాజీనగర్‌లో ఈ నెల 8న సాయంత్రం మహిళ గడియారం బాలమణి(62) హత్య సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. మృతురాలి కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న గజ్వేల్ పోలీసులు విచారణ చేపట్టారు. ఘటనా స్థలంతో పాటు నూతన టెక్నాలజీ, సీసీ ఫుటేజీని పరిశీలించి శనివారం అనుమానితురాలు రజియా అలియాస్ హసీనా(46)ను అదుపులోకి తీసుకుని విచారించగా.. నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. సంవత్సరం క్రితం కల్లు కంపౌండ్‌లో మృతురాలితో హసీనాకు పరిచయం ఏర్పడింది. ఈ పరిచయంతో రజియాకు అవసరమైనప్పుడల్లా మృతురాలి వద్ద డబ్బులు తీసుకునేది. నెలరోజుల క్రితం బాలమణికి ఆమె చిన్న కోడలు సరిత అలియాస్ వాణితో గొడవ జరుగగా, ఆమె తన భర్త ఇద్దరు పిల్లలతో సహా అద్దెకు రూం తీసుకుని ఉంటున్నారు. రజియా రెండు, మూడు సార్లు బాలమణి వద్దకు కల్లు తీసుకుని వెళ్లి అక్కడే సేవించేది. ఈ క్రమంలో మృతురాలి ఒంటిపై బంగారు, వెండి నగలను ఉండడాన్ని గమనించిన రజియా.. 8న మధ్యాహ్నం 3.30 గంటలకు ఆమె ఇంటికెళ్లి మెడలోని పసుపు దారంతో గట్టిగా గుంజి బాలమణిని చంపేసింది. అనంతరం బంగారు చెవిపోగులు, వెండి నగలు దొంగిలించినట్లు నేరం ఒప్పుకున్నదని ఏసీపీ తెలిపారు. నిందితురాలి నుంచి బంగారు, వెండి నగలను రికవరీ చేసి రిమాండ్‌కు పంపించామన్నారు. కేసును ఛేదించిన గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదా, అదనపు సీఐ ముత్యంరాజు, తొగుట సీఐ లతీఫ్, ఏఎస్ఐ ఓమర్, యాదగిరి, సిబ్బంది వెంకన్న, వెంకటేశ్, రవి, నరేందర్, స్వామి, దివ్యను ఏసీపీ పురుషోత్తంరెడ్డి అభినందించారు. త్వరలోనే సిద్దిపేట సీపీ చేతులమీదుగా రివార్డును అందజేయనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి


జగదేవ్‌పూర్, మే 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందాడు. జగదేవ్‌పూర్ మండలం చాట్లపల్లికి చెందిన కృష్ణ, కవిత దంపతులకు కుమారుడు విష్ణువర్ధన్(5), కూతురు ఉన్నది. శనివారం సాయంత్రం విష్ణువర్ధన్ గ్రామంలో కిరాణా దుకాణానికి వెళ్లి, తిరిగి రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో జగదేవ్‌పూర్ నుంచి చేర్యాల వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో బాలుడు టైర్ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. కళ్ల ముందే కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనపూర్‌లో గడ్డి ట్రాక్టర్ దగ్ధం


దగ్ధమవుతున్న ఎండు గడ్డి ట్రాక్టర్

తూప్రాన్, మే 10(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలం ఘనపూర్‌లో శనివారం ఎండు గడ్డి ట్రాక్టర్ దగ్ధమైంది. ఘనపూర్ గ్రామపంచాయతీ పరిధి దమ్మక్కపల్లి గ్రామానికి చెందిన బర్ల సాయిలు సుమారు వంద మోపుల ఎండుగడ్డిని తన ట్రాక్టర్‌లో సిద్దిపేట జిల్లాలోని మక్తామాసాన్‌పల్లికి తీసుకెళ్తున్నాడు. మార్గమధ్యలో ఘనపూర్ గ్రామంలోకి రాగానే ట్రాక్టర్‌కు కిందుగా ఉన్న విద్యుత్ వైర్లు తగిలి షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. ట్రాక్టర్‌లో ఉన్న గడ్డికి మంటలు అంటుకున్నాయి. డ్రైవర్ అప్రమత్తమై హైడ్రాలిక్ సహాయంతో కింద వేయడంతో ప్రమాదం తప్పింది.





అప్పులోళ్ల వేధింపులకు తండ్రి ఆత్మహత్య

- సంగాయిపేట గ్రామంలో విషాదం


శేఖర్(ఫైల్)

కొల్చారం, మే 10 (ఆంధ్రజ్యోతి) : తనయుడు చేసిన అప్పులకు తండ్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మెదక్ జిల్లా సంగాయిపేట గ్రామానికి చెందిన మన్నె శేఖర్(48)కు ఇద్దరు భార్యలు. మొదటి భార్య కుమారుడు సాయికిరణ్ వ్యాపారం కోసం గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో చాలావరకు అప్పులు చేశాడు. అయితే అప్పులు ఇచ్చినవారు తండ్రిని అడగడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం గ్రామ సమీపంలో విద్యుత్ స్తంభానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మొదటి భార్య వసంత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో అందరితో కలుపుగోలుగా ఉండే శేఖర్ మృతిచెందడంతో గ్రామస్థులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి కుటుంబసభ్యులను మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి పరామర్శించి, ఓదార్చారు.

నిజాంపేటలో వ్యక్తి..


నాగరాజు(ఫైల్)

నిజాంపేట, మే 10 (ఆంధ్రజ్యోతి) : అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిజాంపేట మండలం నందిగామ గ్రామానికి చెందిన ఆకుల నాగరాజు(37) ఇద్దరు భార్యలతో జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ అవసరాల నిమిత్తం సుమారు రూ.6 నుంచి రూ.7 లక్షల వరకు అప్పులు చేశాడు. పని దొరక్క, అప్పులు తీర్చే మార్గం లేక శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి బాల్‌నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామాయంపేట ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ప్రొబిషనరీ ఎస్‌ఐ సృజన తెలిపారు. నాగరాజు మృతితో భార్యలు, ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు.

ప్రమాదవశాత్తు నీట మునిగి వ్యక్తి మృతి

పాపన్నపేట, మే 10 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు నీట మునిగి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని అన్నారం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జనుముల శివరాములు(35) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం గ్రామ శివారులోని కొత్తకుంట వద్ద ఉపాధిహామీ పనుల కోసం కుటుంబసభ్యులతో కలిసి వెళ్లాడు. కాగా కాలకృత్యాలకు సమీపంలో ఉన్న వాటర్‌షెడ్ చెక్‌డ్యాం వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీట మునిగిపోయాడు. రాములు ఎంతకీ రాకపోయేసరికి కుటుంబీకులు చెక్‌డ్యాం వద్దకు వెళ్లగా ఒడ్డున చెప్పులు, దుస్తులు కనిపించాయి. నీటిలో గాలించగా మృతదేహం లభ్యమైంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. భార్య పావని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి


నరేష్(ఫైల్)

చేగుంట, మే 10 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందాడు. మెదక్ జిల్లా చేగుంట మండలం నార్సింగి గ్రామానికి చెందిన చందంపేట నరేష్(30) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామ శివారులోని కాముని చెరువులో గురువారం రాత్రి చేపల వేటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతిచెందాడు. శనివారం మధ్యాహ్నం మృతదేహం తేలడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారమందించారు. ఎస్‌ఐ అహ్మద్ మొినుద్దీన్ సంఘటనా స్థలానికి చేరుకుని జాలర్ల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయించి, పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

కుక్కల దాడిలో 30 గొర్రెల మృత్యువాత


కుక్కల దాడిలో మృత్యువాత పడ్డ గొర్రెలు

హత్నూర, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఊర కుక్కల దాడిలో 30 గొర్రెలు మృత్యువాత పడ్డ సంఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలోని కాసాల గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన పాముల సురేష్, ఆరెగళ్ల కిష్టయ్య రోజు మాదిరిగానే గొర్రెలను మేతకు తీసుకెళ్లి సాయంత్రం పాకలో ఉంచారు. అర్ధరాత్రి సమయంలో ఊర కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో 30 మృతవాత పడ్డాయి. దీంతో సుమారు రూ.2 లక్షల వరకు నష్టపోయినట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు

ఆరు తులాల బంగారం మాయం

- బస్సులో ప్రయాణిస్తుండగా ఘటన

నర్సాపూర్, మే 10 (ఆంధ్రజ్యోతి) : వెల్దుర్తి నుంచి నర్సాపూర్‌కు ఆర్టీసీ బస్సులో వస్తున్న మహిళ బ్యాగులో ఉన్న ఆరు తులాల బంగారు నగలు చోరీకి గురైన ఘటన శనివారం చోటు చేసుకుంది. కౌడిపల్లి మండలం వెంకట్రావ్‌పేటకు చెందిన అనుసూయ వెల్దుర్తికి వెళ్లి.. తిరిగి తన సొంత గ్రామానికి వెళ్లేందుకు నర్సాపూర్ వచ్చే బస్సు ఎక్కింది. నర్సాపూర్ బస్టాండ్‌కు వచ్చాక అనుమానం వచ్చి బ్యాగు చూడగా.. అందులో ఉన్న ఆరు తులాల బంగారు నగలు కనిపించకపోవడంతో లబోదిబోమంటూ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్‌ఐ లింగం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎల్లమ్మగుట్టపై పూర్తికాని
త్రిశులం, ఢమరుకం పనులు

- రూ.63 లక్షలతో పనులు
- డిజైన్ మార్పుతో రూ.20 లక్షలు పెరిగిన వ్యయం
- ఆరునెలల క్రితం కమిషనర్‌ను కోరినా మంజూరు కాని నిధులు
- దేవాదాయశాఖ నిర్లక్ష్యం

చేర్యాల, మే 10 (ఆంధ్రజ్యోతి) : పరమశివుడి ప్రతిరూపంగా విరాజిల్లుతున్న కొమురవెల్లి మల్లన్న ఆలయ ఔన్నత్యాన్ని చాటడంతో పాటు శైవక్షేత్ర ఆనవాలు ప్రతిబింబించేలా ఎల్లమ్మగుట్టపై త్రిశూలం-ఢమరుక ఏర్పాటుకు చర్యలు తీసుకున్నా నిధుల లేమి వెంటాడుతుంది. గత డిసెంబరులో జరిగే కల్యాణానికి అందుబాటులోకి తీసుకువస్తామని ఆలయవర్గాలు ప్రకటించి. ఏర్పాటు పనులు వేగవంతం చేసినా నిధులు సరిపడకపోవడంతో అర్ధాంతరంగా వదిలేశారు. శ్రీశైలం, విజయవాడ తదితర ఆలయాల మాదిరిగా ఎల్లమ్మగుట్టపై త్రిశూలం, ఢమరుకం నెలకొల్పనుండటంతో నూతన శోభ సంతరించుకోనున్నదని భావించినా కార్యరూపం దాల్చకపోవడంతో భక్తులు ఉసూరుమంటున్నారు. ఆలయంలో యేటా మూడునెలలపాటు జరిగే మహా జాతరకు లక్షలాదిమంది భక్తులు తరలివస్తున్నారు. కాలక్రమేణా సాధారణ రోజుల్లోనూ భక్తుల రద్దీ పెరిగింది. కిక్కిరిసిన జనాలతో కిటకిటలాడే పరిసరాలు, చుట్టూ పచ్చని పొలాలు, చెరువు, గుట్టలతో కనువిందు చేస్తుండటంతో భక్తితో పాటు ఆహ్లాదాన్ని ఆస్వాదించేందుకు భక్తులు గుట్టపైకి ఎక్కడానికి తహతహలాడుతుంటారు. రాజీవ్ రహదారికి అతి సమీపంలో మల్లన్న ఆలయం ఉండటంతో సుదూరంనుండే రాజగోపురం, గుట్ట కనిపిస్తుంటుంది. పరమశివుడు త్రిశూలం, ఢమరుకం ధరించి ఉండటంతో ఆలయ కీర్తిని మరింత వ్యాప్తి చేసేందుకు ఎల్లమ్మగుట్టపై త్రిశూలం-ఢమరుకం ఏర్పాటు చేయాలని సంకల్పించి రూ.63 లక్షలు నిధులు కేటాయించారు. 20 సెప్టెంబరు 2023న శంకుస్థాపన చేయగా పనులు తుది దశకు చేరుకున్నాయి. హైదరాబాద్‌లోని ఓ కార్ఖానాలో స్టీల్‌తో త్రిశూలం, ఢమరుకం, ఓం ఆకారం తయారీ పనులు పూర్తిచేయించారు. ఈదురుగాలులు, వర్షానికి తట్టుకునేలా సంబంధిత ఆకారాలను బిగించేందుకు రెండు అంతస్తులలో స్లాబు భవనం నిర్మాణం పూర్తిచేశారు. మొదటి అంతస్తులో టికెట్ కౌంటర్, రెండో అతస్తు ప్రదేశాన్ని ఇతరత్రా అవసరాలకు వినియోగించుకోనున్నారు. కానీ డిజైనింగ్‌లో మార్పుల వల్ల ప్రతిపాదిత వ్యయం సరిపడలేదు. దీంతో అదనంగా రూ.20 లక్షలు అవసరపడతాయని, నిధులు మంజూరు చేస్తే పనులు పూర్తవుతాయని గతేడాది నవంబరు నెలాఖరులో దేవాదాయశాక కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపించారు. కానీ నేటికీ ప్రత్యామ్నాయ చర్యలు కానరాకపోవడంతో అతీగతీ లేకుండా మారింది. లక్షలాది రూపాయలు వెచ్చించినా ప్రయోజనం చేకూరకపోవడంతో భక్తులు ఉసూరుమంటున్నారు. ఈ విషయమై ఆలయ పాలకమండలితో పాటు అధికారులు ప్రత్యేక చొరవ వహించి త్రిశూలం ఓంకారం బిగింపు పనుల పూర్తికి చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

కమిషనర్ అనుమతి రాగానే పనులు పూర్తి చేస్తాం



మల్లన్న ఆలయం శైవక్షేత్ర ఆనవాలు ప్రతిబింబింపచేసేందుకు రూ.63 లక్షలతో ఎల్లమ్మ గుట్టపై త్రిశూలం, ఢమరుకం పనులు చేపట్టాం. బిగింపు పనులు పూర్తి దశకు చేరుకున్నాయి. డిజైనింగ్‌లో మార్పు కారణంగా మరో రూ.20 లక్షలు అవసరపడ్డాయి. దేవాదాయశాఖ కమిషనర్ ద్వారా రివైస్డ్ అనుమతులు రావడంతోనే పనుల పూర్తి చేయించి త్వరగా అందుబాటులోకి తీసుకొస్తాం.

\- అన్నపూర్ణ, ఈవో



గుట్టపై త్రిశూలం, ఢమరుకం

సాఫీగా ధాన్యం కొనుగోళ్లు జరగాలి

- టార్పాలిన్, గన్నీ బ్యాగులు సరిపడా ఇవ్వాలి
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



అక్కన్నపేట కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

రామాయంపేట, మే 10 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లు సాఫీగా జరిగేలా చూడాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. తేమశాతం రాగానే పంట కొనాలని సూచించారు. శనివారం రామాయంపేట మండలం అక్కన్నపేట కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి, రిజిస్టర్ పరిశీలించారు. అనంతరం నిర్వాహకులతో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు పంట తూకం వేసి రైతు పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. బస్తాలను లోడ్ చేసేందుకు లారీలను ముందుగానే ఉంచుకోవాలని తెలిపారు. కాగా ప్రస్తుతం గన్నీ సంచులు, టార్పాలిన్ కవర్లు సరిపడా ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. కొనుగోళ్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని కేంద్ర నిర్వాహకులకు సూచించారు.

సెక్యూరిటీ గార్డుపై దాడి

- డబ్బులు, మొబైల్ అపహరణ, ఆలస్యంగా ఫిర్యాదు

తూప్రాన్, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఆటోలో ప్రయాణిస్తున్న సెక్యూరిటీ గార్డుపై ఆటోడ్రైవర్, మరో ఇద్దరు దాడిచేసి, ఫోన్ నుంచి డబ్బులు బదిలీ చేయించుకొని, మొబైల్ ఫోన్‌ను కింద పడేసి ఉడాయించారు. ఈ సంఘటన తూప్రాన్ పట్టణ పరిధిలో చోటు చేసుకోగా, ఆలస్యంగా శనివారం ఫిర్యాదు చేశారు. తూప్రాన్ ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన మనీష్‌కుమార్ గుర్జి తూప్రాన్‌లో ఉంటూ సెక్యూరిటీ సర్వీసెస్‌లో పనిచేస్తున్నాడు. గతనెల 30న సాయంత్రం మేడ్చల్ నుంచి తూప్రాన్ వైపు వస్తున్న ఆటోలో మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లిలో దిగేందుకు ఎక్కాడు. ముప్పిరెడ్డిపల్లి వద్ద ఆటో ఆపమన్నా డ్రైవర్ ఆపకుండా వేగంగా ముందుకు తీసుకెళ్లాడు. ఆటోలో ఉన్న మరో ఇద్దరు వ్యక్తులు దాడిచేసి ఫోన్‌పే నుంచి రూ2 వేలు బదిలీ చేయించుకున్నారు. తూప్రాన్ పట్టణ శివారులోని టోల్‌ప్లాజా వద్దకు రాగానే మొబైల్ ఫోన్ లాక్కొని కిందకు తోసి పడేశారు. తీవ్రంగా గాయపడటంతో ఆలస్యంగా శనివారం ఫిర్యాదు చేసినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు.

మట్టి తరలింపుపై అధికారుల కొరడా

- తాడ్దానిపల్లిలో రెండు టిప్పర్లు సీజ్

పుల్‌కల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పుల్కల్ మండలంలో మట్టి అక్రమ తరలింపుపై రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించారు. ఉమ్మడి పుల్కల్ మండలంలోని గొంగ్లూరు, గంగోజీపేట, శివంపేట, తాడ్దానిపల్లి, సుల్తాన్‌పూర్, చౌటకూర్, సరాఫ్‌పల్లి తదితర గ్రామాల్లో కొంతమంది మట్టి దందా చేస్తున్నారు. రాత్రివేళల్లో గుట్టుచప్పుడు కాకుండా ఎక్స్‌కవేటర్లతో మట్టి తవ్వి టిప్పర్లలో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మట్టి తరలింపుపై రెవెన్యూ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో చౌటకూర్ తహసీల్దార్ అనుదీప్ రెవెన్యూ సిబ్బందితో కలిసి శనివారం రాత్రి తాడ్దానిపల్లి గ్రామ శివారు నుంచి మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లు పట్టుకుని సీజ్‌చేసి, పుల్కల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా మట్టిని తరలిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అనుదీప్ హెచ్చరించారు.

బైక్‌ను ఢీకొన్న డీసీఎం.. డ్రైవర్‌కు తీవ్రగాయాలు

రామాయంపేట, మే 10 (ఆంధ్రజ్యోతి) : చేగుంట హైవేపై ఓ బైకర్‌ను ఢీకొట్టి ఆపకుండా వస్తున్న కంటైనర్ డ్రైవర్ తృటిలో భారీ ప్రమాదాన్ని తప్పించుకున్నాడు. ప్రమాద స్థలంలో చూసిన కొందరు కంటైనర్‌ను వెంబడించారు. దీంతో అతివేగంగా నడుపుతూ.. కన్ఫ్యూజన్‌లో రామాయంపేట రహదారిపై మరో డీసీఎంను ఢీకొని కొంత దూరంలోని కల్వర్టుకు తగిలి కంటైనర్ ఆగిపోయింది. డ్రైవర్ అబీద్‌ఖాన్ తలకు బలమైన గాయమైంది. పోలీసులు బాధితుడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కంపెనీ సామగ్రి, వ్యవసాయ పనిముట్లు చోరీ

తూప్రాన్, మే 10 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణ పరిధి రావెల్లి శివారులోని ఓ ప్రైవేటు కంపెనీ గోదాంలో ఉన్న కంపెనీ సామగ్రి, వ్యవసాయ పనిముట్లు చోరీకి గురయ్యాయి. ఎస్‌ఐ శివానందం వివరాల ప్రకారం.. తూప్రాన్ పట్టణ పరిధి రావెల్లి శివారులో సన్‌షైన్ కెమికల్స్ కంపెనీకి చెందిన స్థలంలో గోదాం నిర్వహిస్తున్నారు. అందులో కంపెనీ యంత్రాలు, సామగ్రి, వ్యవసాయ పనిముట్లు నిలువ ఉంచుతున్నారు. ఈనెల 7న రాత్రి వర్షం రావడంతో వాచ్‌మెన్ నక్కపల్లి వెంకటేష్ తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. 8న ఉదయం వచ్చి చూడగా కంపెనీకి చెందిన ఇనుప యంత్రాలు, సామగ్రి, వ్యవసాయ పనిముట్లు చోరీ జరిగినట్టు గుర్తించాడు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శనివారం రాత్రి ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ శివానందం వివరించారు.

జవాన్ల త్యాగం అందరికీ స్ఫూర్తిదాయకం

- సైనికుల కుటుంబాలను కేంద్రం ఆదుకోవాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు



సంగారెడ్డిలోని కేకే భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న చుక్క రాములు

సంగారెడ్డి రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : వీర జవాన్లు ప్రదర్శించిన ధైర్య సాహసాలు అందరికీ స్ఫూర్తిదాయకమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు అన్నారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ రక్షణలో అసువులు బాసిన జవాన్లకు సీపీఎం ప్రగాఢ సానుభూతి తెలియజేస్తుందన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన సైనిక కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. జిల్లాలో మంచినీటి ఎద్దడి రోజురోజుకు తీవ్రమవుతున్నదని, మంచినీటి సమస్యకు పరిష్కారం చూపాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌర్యాలు కల్పించాలని, తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీ.సాయిలు, రాజయ్య పాల్గొన్నారు.

'పాలిసెట్'కు ఏర్పాట్లు పూర్తి

- హాజరుకానున్న 2784 మంది విద్యార్థులు



సంగారెడ్డి మండలం హనుమాన్‌నగర్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ జానకీదేవి

సంగారెడ్డి రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈ నెల 13న నిర్వహించనున్న పాలిసెట్ పరీక్షలకు అన్నిరకాల ఏర్పాట్లు చేశారు. సంగారెడ్డి విద్యానగర్‌లోని సెయింట్ అంథోని హైస్కూల్, బాలికల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్‌వీ జూనియర్ కళాశాల, కరుణ హైస్కూల్, బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోని హైస్కూల్, జోగిపేటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మొత్తం 7 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా కో ఆర్డినేటర్ జానకీదేవి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థుల గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష ప్రారంభమైన తరువాత నిమిషం ఆలస్యమైనా లనుమతించబోమని స్పష్టం చేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించామని జానకీదేవి తెలిపారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం: సీఐ

మెదక్ కల్చరల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మెదక్ మండల పరిధిలోని మక్త భూపతిపూర్ గ్రామంలో ఎంబీపూర్ సీజన్ ది క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పిల్లలు ఫోన్లలో ఉండడం, చెడు వ్యసనాలకు బానిసవ్వడం కంటే ఆటలపై దృష్టిసారించి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఉత్తమమని ఆయన సూచించారు.

అమర జవాన్‌కు నివాళులు



జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న నర్సంపల్లి పెద్దతండావాసులు

చేగుంట/వెల్దుర్తి, మే 10 (ఆంధ్రజ్యోతి) : భారత్-పాకిస్తాన్ యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్‌కు నార్సింగి మండలం నర్సంపల్లి పెద్దతండావాసులు శనివారం నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ చత్రియానాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ బిక్యానాయక్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు భాషానాయక్, తండావాసులు మురళీనాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని జాతీయ జెండాతో తండాలో ర్యాలీ నిర్వహించారు. అలాగే వెల్దుర్తి మండలంలో మురళీనాయక్‌కు యువకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురళీనాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని వెల్దుర్తి బస్టాండ్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శేఖర్‌గౌడ్, వెంకటేష్, శ్రీనివాస్, నవీన్, చందు, పోచయ్య, భాను, పవన్, ప్రేమ్‌కుమార్, రంజిత్‌రెడ్డి, లక్ష్మణ్, హన్‌మాన్ స్వాములు తదితరులు పాల్గొన్నారు.



వెల్దుర్తిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

నాలుగు దశాబ్దాలుగా గుడిసెల్లోనే..!

- వివిధ ప్రాంతాల నుంచి కొత్తపేట గ్రామానికి వలస
- కనీస సౌకర్యాలకూ నోచుకోని గంగిరెద్దుల కుటుంబాలు
- ఏళ్లుగా విద్యుత్ సౌకర్యం లేక చీకట్లో జీవనం
- 40 కుటుంబాల్లో ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్లు



కొత్తపేటలో గంగిరెద్దుల కుటుంబాలు ఏర్పాటు చేసుకున్న గుడిసెలు



విద్యుత్ సదుపాయం లేని గుడిసెలు

శివ్వంపేట, మే 10 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు.. గంగిరెద్దులతో డుడూ బసవన్నలతో ఇంటి ముందు నృత్యాలతో కనువిందు చేసే గంగిరెద్దుల కుటుంబాలు దుర్భర పరిస్థిలు ఎదుర్కొంటున్నారు. 40 ఏళ్లుగా తాత్కాలిక గుడిసెల్లో, విద్యుత్ లేక అంధకారంలో మగ్గుతున్నారంటే పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. బాన్సువాడ, హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన బత్తుల ఎల్లయ్య, బత్తుల ఊశయ్య, మేకల సాయిలు, మేకల రాజు బత్తుల మారయ్యతో కలిపి మొత్తం 40 కుటుంబాల వారు మెదక్ జిల్లా శివ్వంపేట మండలం కొత్తపేట గ్రామానికి వలసొచ్చారు. ఇక్కడే గుడారాలు ఏర్పాటు చేసుకుని గంగిరెద్దులను ఆడిస్తూ భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే 40 ఏళ్లుగా వీరు కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు. పక్కా ఇళ్లు అవస్థలు పడుతున్నారు. ఏళ్లుగా గ్రామపంచాయతీకి పన్ను కడుతున్నా తమను ఎవరూ పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ 40 కుటుంబంలోని ఐదు కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరుకావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మిగతా కుటుంబాలకు కూడా ఇళ్లు మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.

20 ఏళ్లుగా ఇంటి పన్ను కడుతున్నాం



గ్రామంలో ఓటు హక్కు పొంది.. 20 ఏళ్లుగా ఇంటి పన్ను కడుతున్నాం. ఇప్పటికీ తమ కుటుంబాలకు సొంత ఇల్లు లేదు. విద్యుత్ మీటర్లు లేవు. రోడ్లు, మురుగు కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం తమ కుటుంబాలకు మౌలిక వసతులు కల్పించాలి.

\- పోచమ్మ, కొత్తపేట

తాతల నుంచి ఇక్కడే ఉంటున్నాం



తాతల కాలం నుంచి కొత్తపేటలో గుడిసెలను ఏర్పాటు చేసుకొని గ్రామాల్లో భిక్షాటన చేస్తూ బతుకుతున్నాం. సొంత ఇల్లు లేక వర్షాకాలంలో ప్లాస్టిక్ కవర్లు, తడకలతో ఏర్పాటు చేసుకున్న గుడిసెలు చిన్నపాటి వర్షానికే ఉరుస్తున్నాయి. 20 నుంచి 30 గజాల్లో ఉన్న గుడిసెల్లో పిల్లలతో కాలం వెళ్లదీస్తున్నాం.

\- మేకల సాయిలు, కొత్తపేట

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిన్నశంకరంపేట మే 10 (ఆంధ్రజ్యోతి) చిన్నశంకరంపేట మండలంలోని సూరారం గ్రామ పరిధి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో ఆదివారం మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీ మోహన్ బాబు, ఈ దినాకర్ శనివారం ప్రకటనలో తెలిపారు. సూరారం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలు బాగిర్తిపల్లిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

● తూప్రాన్, మే 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వైర్ల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో మండలంలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పేర్కొన్నారు.

ఇంటర్ ప్రవేశాల కోసం కౌన్సెలింగ్

చేగుంట, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బాలికల గిరిజన స్పోర్ట్స్ గురుకుల పాఠశాలలో ఈ నెల 15న ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు రీజినల్ కో ఆర్డినేటర్ గంగారం నాయక్ ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరం గాను ఇంటర్మీడియట్ ఇంటర్‌లో ప్రవేశం కొరకు బాలికలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

సంగారెడ్డి 'వెల్‌నెస్'లో మాత్రల్లేవ్ !

సంగారెడ్డి అర్బన్, మే 10(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలోని వెల్‌నెస్ సెంటర్‌లో మందుల కొరత వేధిస్తోంది. అత్యంత ప్రాధాన్యమైన బీపీ, షుగర్‌తో పాటు సుమారు 30 రకాల మాత్రలు అందుబాటులో లేవని సిబ్బంది చెబుతున్నారు. 15 రోజులుగా ఆయా మందులు కొరత ఏర్పడడంతో ఇబ్బందులు పడుతున్నామని ఉద్యోగులు,పెన్షనర్లు, జర్నలిస్టుల కుటుంబసభ్యులు వాపోతున్నారు. ఓ వైపు రెగ్యులర్ డాక్టర్లు లేకపోవడం, మరో వైపు వెల్‌సెన్ సెంటర్‌లో నెలకొన్న మందుల కొరత వల్ల అనారోగ్య సమస్యలతో అక్కడికి వచ్చినవారు ఉసూరుమంటూ వెనుదిరిగిపోతున్నారు. కాగా వెల్‌నెస్ సెంటర్‌లో సమస్యలను పరిశీలించేందుకు ఈ నెల 6వ తేదీన ఆరోగ్యశ్రీ(ఈజేహెచ్‌ఎస్) డిప్యూటీ ఈవో చంద్రశేఖర్ సెంటర్‌ను సందర్శించారు. అయితే ఆ తర్వాత సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్న దాఖలాలు మాత్రం కనిపించలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వెల్‌నెస్ సెంటర్‌లో మాత్రల కొరతతో పాటు డాక్టర్ల నియామకానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మెదక్ పోస్టాఫీసులో ఆధార్ సేవలు

మెదక్ అర్బన్, మే 10(ఆంధ్రజ్యోతి): మెదక్ ప్రధాన తపాలా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కౌంటర్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఎస్పీ శ్రీహరి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. కొత్త ఆధార్ నమోదు ఉచితంగా చేస్తామన్నారు. పేరు, చిరునామా మార్పు, మొబైల్ నెంబర్ అనుసంధానం, తప్పుల సవరణ, పుట్టిన తేదీ, బయోమెట్రిక్‌తోపాటు మరిన్ని సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు.

సీఐటీయూ బైక్ ర్యాలీ

జిన్నారం, మే 10 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. శనివారం కాజీపల్లి పారిశ్రామికవాడలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మే 20న దేశవ్యాప్తంగా నిర్వహించే కార్మిక వర్గాల సమ్మెను జయప్రదం చేయాలని, సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని రాజయ్య తెలిపారు.

'ఉపాధిహామీని రద్దు చేసే కుట్ర'

హవేళిఘణపూర్, మే10 (ఆంధ్రజ్యోతి); కేంద్రప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని రద్దు చేసే కుట్ర చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం తెలిపారు. శనివారం మండలంలోని లింగ్సాన్‌పల్లితండాలో ఉపాధి పని నిర్వహిస్తున్న ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పరిరక్షణ కోసం దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలన్నారు.

బీజేపీ మాసాయిపేట మండల అధ్యక్షుడిగా నాగేందర్ రెడ్డి

మాసాయిపేట, మే 10(ఆంధ్రజ్యోతి) : బీజేపీ మండల పార్టీ నూతన అధ్యక్షుడిగా పోతన శెట్టిపల్లి గ్రామానికి చెందిన మొలుగు నాగేందర్‌రెడ్డి నియామకం అయ్యారు శనివారం మొలుగు నాగేందర్ రెడ్డిని నూతన అధ్యక్షుడిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్ నియామక పత్రాలను అందజేశారు

బీజేపీ హత్నూర మండల అధ్యక్షుడిగా నాగప్రభుగౌడ్

హత్నూర, మే 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ హత్నూర మండల శాఖ అధ్యక్షుడిగా నాగప్రభుగౌడ్‌ను నియమిస్తూ పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. ఆయనకు పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాగప్రభుగౌడ్ మాట్లాడుతూ మండలంలో పార్టీ పటిష్టం కోసం శక్తి వంచన లేకుండా పని చేస్తానని అన్నారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్‌గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

జహీరాబాద్‌లో పేరుకే వందపడకల ఆస్పత్రి

● ఏడాది కాలంగా ప్రభుత్వ దవాఖాన అభివృద్ధిపై సమీక్షలు కరువు
● రోగులకు మొక్కుబడిగా సేవలు
● అత్యవసర సేవలకు దూరం
● రోజుకు వెయ్యి మంది ఓపీ
● క్యాంటీన్ సౌకర్యానికి నోచుకోని రోగుల బంధువులు, సహాయకులు




ప్రభుత్వాస్పత్రి ఓపీలో బారులు తీరిన రోగులు, క్యాంటీన్ వసతి లేక ఆవరణలో నేలపై భోజనం చేస్తున్న రోగుల సహాయకులు

జహీరాబాద్, మే 10(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి పేరుకే వంద పడకల ఆస్పత్రిగా ఉన్నా.. నిర్వహణ మాత్రం అస్తవ్యస్తంగా తయారైంది. ఓ వైపు సమీక్షలు కొరవడడం, మరోవైపు ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం, ఒకవేళ సందర్శించినా మొక్కుబడి తనిఖీలతో పని కానిచ్చేయడంతో రోగులు సర్కారు దవాఖానాకు వచ్చేందుకే జంకే పరిస్థితి నెలకొన్నది. ఆస్పత్రిలో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో రోగులకు తిప్పలు వర్ణనాతీతం.

క్యాంటీన్ లేక ఇక్కట్లు

పట్టణంలో వందపడకల ఆస్పత్రిని ఏర్పాటుచేసిన నేపథ్యంలో ఆస్పత్రికి ప్రతినిత్యం సుమారు వేయి మంది రోగులు వైద్యం కోసం వస్తుంటారు. వారికి తోడుగా బంధువులు, సహాయకులు కూడా ఉంటారు. ఇంతమంది వస్తున్నా ఆసుపత్రిలో సరైన క్యాంటీన్ సౌకర్యం కూడా లేదు. ఆస్పత్రి అంతర్భాగంలో ఏర్పాటు చేసిన చిన్నా చితక హోటళ్లలో అధికధరలు ఉండగా, అందులో అన్ని ఆహారపదార్థాలు దొరకక పోవడంతో రోగుల వెంట వచ్చిన బంధువులు, సహాయకులు బయటకువెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొన్నది. అంతే కాకుండా ఆస్పత్రి ఆవరణలో అపరిశుభ్రత, మందుల వాసనతో కాస్త బయటకువెళ్లి భోంచేద్దామన్నా అనువైన పరిసరాలు లేకపోవడం గమనార్హం. ఆస్పత్రి ఆవరణలో ప్రత్యేకంగా స్థలమైతే ఉంది. ఆస్పత్రి అంతర్భాగం ప్రధానరోడ్డుకు ఆనుకుని ఉండడంతో క్యాంటీన్ ఏర్పాటు చేస్తే ఆస్పత్రికివచ్చే ప్రజలతో పాటు రోడ్డు పైనుంచి వెళ్ళేవారికి సైతం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకొని ఆస్పత్రి ఆవరణలో క్యాంటీన్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధిపై సమీక్షలు ఏవీ?

ప్రభుత్వాస్పత్రి అభివృద్ధిపై అభివృద్ధికమిటీ సమీక్షలు నిర్వహించక పోవడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఏడాది కాలంగా ఆస్పత్రి అభివృద్ధిపై ప్రత్యేకంగా కమిటీ అంటూ ఏదీ లేకపోవడంతో రోగుల ఇబ్బందులను పట్టించుకునేవారే కరువయ్యారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మొక్కుబడిగా సేవలందించడం, రిస్క్‌తో కూడుకున్న పేషెంట్లువస్తే రెఫరల్ చేయడంతో జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రి రిఫరల్‌కు కేంద్రంగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో ఆస్పత్రి అభివృద్ధికి సంబంధించిన కమిటీ సమీక్షలు నిర్వహిస్తూ ప్రతీ వైద్యుడి పనితీరును, సిబ్బంది పనితీరును పరిగణనలోకి తీసుకొని తగిన సూచనలతో పాటు హెచ్చరికలు చేసేవారు. ప్రస్తుతం సమీక్షలు లేని కారణంగా ఎవరి దారి వారిదే అన్న చందంగా వ్యవహరిస్తూ రోగుల ఇబ్బందులకు కారణమవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిలో సిబ్బంది పనితీరుపై పర్యవేక్షిస్తూ రోగులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

కస్తూర్బాలో ఇంటర్ తరగతులకు గ్రీన్ సిగ్నల్



రేగోడు కస్తూర్బా విద్యాలయం

రేగోడు మే10(ఆంధ్రజ్యోతి): రేగోడు కస్తూర్బా విద్యాలయంపదో తరగతి ఫలితాల్లో వరుసగా వంద శాతం ఉత్తీర్ణతా ఫలితాలు సాధిస్తూ జిల్లాలోనే టాప్‌లో నిలిచింది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ తరగతులు నిర్వహించేందుకు అనుమతి రావడంతో అడ్మిషన్లు కొనసాగుతున్నాయి. రేగోడు కస్తూర్బా విద్యాలయం 2005లో 6వ తరగతి ప్రారంభమైంది. 207-08లో మొదటి 10వ తరగతి బ్యాచ్ ప్రారంభమైంది. డ్రాపఅవుట్, చదువు మానేసి ఇంటి వద్ద ఉంటున్న విద్యార్థులను గుర్తించి కస్తూర్బా పాఠశాలలో చేర్పించారు. డ్రాపవుట్ విద్యార్థులు అయినప్పటికీ విద్యలో, క్రీడల్లో రాణిస్తూ పదోతరగతి ఫలితాల్లో వరుసగా 11 సార్లు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. దీంతో జిల్లా స్థాయిలోనే రేగోడు కస్తూర్బా విద్యాలయంకు మంచి గుర్తింపు వచ్చింది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ కోర్సు కు అనుమతి రావడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రేగోడు కస్తూర్బా విద్యాలయంలో ఇంటర్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ, ఎంపీసీ ఇంగ్లిష్ మీడియంలో నిర్వహిస్తున్నారు. ఒక్కో కోర్సులో 40 సీట్లు కేటాయించారు. ఈ నెల 31 వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ విద్యాసంవత్సరం జూన్ ఒకటో తేదీ నుంచి ఇంటర్ తరగతులు ప్రారంబిస్తున్నట్లు ప్రత్యేక అధికారి స్వయంప్రభ శనివారం తెలిపారు.

కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సంగారెడ్డి జిల్లా కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, కోశాధికారి రమేశ్‌లను గజమాలతో సత్కరిస్తున్న కెమిస్టులు

సంగారెడ్డి అర్బన్, మే 10(ఆంధ్రజ్యోతి): కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సంగారెడ్డి జిల్లా కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. సంగారెడ్డిలోని పీఎస్‌ఆర్ గార్డెన్స్‌లో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఈర్న కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా అనుములు సంతోష్‌కుమార్, కోశాధికారిగా ఎదురె రమేశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్యఅతిధిగా టీటీసీడీఏ కోశాధికారి, తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ మెంబర్ తుడుపునీరు రాజు, గౌరవ అతిథులు ఏఐవోసీడీ ఈసీ మెంబర్ చంద్రశేఖర్‌రావు, వెంకట్, కృష్ణకుమార్, శ్రీనివాస్, సుధాకర్, టీటీసీడీఏ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, వైస్ ప్రెసిడెంట్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్, మెదక్ జిల్లా కోశాధికారి శ్రీనివాస్, సిద్దిపేట జిల్లా కోశాధికారి వినోద్, తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ మెంబర్ నాగసాయిశ్రీకేష్‌ల సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. కార్యక్రమంలో సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు కలివేముల దశరథ్, ప్రధాన కార్యదర్శి శశికాంత్‌చందన్, కోశాధికారి కృష్ణ, కెమిస్టులు పాల్గొన్నారు.

ఘనంగా హేమారెడ్డి మల్లమ్మ జయంతి వేడుకలు

కంగ్టి/నాగల్‌గిద్ద, మే 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హేమారెడ్డి మల్లమ్మ ఆలయంలో శనివారం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో హేమారెడ్డి మల్లమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో భూమారెడ్డి, సిద్దారెడ్డి, రాంరెడ్డి, నర్సారెడ్డి, సంగారెడ్డి, అంజిరెడ్డి, సంతోష్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, హనుమారెడ్డి, నాగిరెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నాగల్‌గిద్ద మండల పరిధిలోని ఉట్‌పల్లి గ్రామంలో శనివారం హేమారెడ్డి మల్లమ్మ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు దేవరెడ్డి, నాయకులు రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డీజిల్‌కూ పైసల్లేవ్..!

(మొదటి పేజీ తరువాయి)

రోజులకోసారి చెత్తను సేకరిస్తున్నారు.

మెదక్ జిల్లాలో..

● మనోహరాబాద్ మండలం కాళ్లకల్ మేజర్ పంచాయతీలో 20 వేల జనాభా ఉంది. నిధులు లేక పంచాయతీ కార్యదర్శి సమస్యలను పరిష్కరించలేకపోతున్నారు. నిత్యం టన్నుల కొద్దీ చెత్త ఉత్పత్తవుతుండగా తొలగించడానికి ట్రాక్టర్ నిర్వహణ భారంగా మారింది. సమస్యలను దృష్టికి తెచ్చినప్పటికీ కార్యదర్శి ముఖం చాటేస్తున్నాడని ప్రజలు ఆరోపిస్తున్నారు.

● మెదక్ మండల పరిధిలోని మక్త భూపతిపూర్, శివాయపల్లి, కోంటూర్, రాజ్‌పల్లి, గుట్టకిందిపల్లి గ్రామాల్లో కార్యదర్శులు సొంత డబ్బులు వెచ్చించి ట్రాక్టర్లకు డీజిల్ పోయించి చెత్తను సేకరిస్తున్నారు.

● టేక్మాల్ మండలంలో రెండు మూడు రోజులకోసారి చెత్తను సేకరిస్తున్నారు. నిధులు రాకపోవడంతో కార్యదర్శులు డబ్బులకు ఇబ్బందులు పడుతున్నారు.

● వెల్దుర్తి మండలం మండల చెత్త సేకరణను కొనసాగించేందుకు ఆపసోపాలు పడుతున్నారు. ప్రత్యేకాధికారులు ఆగ్రహిస్తారనే భయంతో కార్యదర్శులు అప్పులు చేసి మరీ చెత్తను ట్రాక్టర్ల ద్వారా సేకరిస్తున్నారు.

● కొల్చారం మండలం పైతర గ్రామంలో ట్రాక్టర్ చెడిపోవడంతో మరమ్మతులకు డబ్బులు లేక రెండు నెలలుగా చెత్త సేకరించడం లేదు. గ్రామంలో ఏ మూల చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు.

● తూప్రాన్ మండల పరిధిలో కార్యదర్శులు తమ వీలునుబట్టి పది, పదిహేను రోజులకోసారి తోపుడు బండ్ల ద్వారా చెత్తను తొలగిస్తున్నారు. ఇప్పటికే ఒక్కో కార్యదర్శి రూ. లక్ష నుంచి రూ. రెండు లక్షల వరకు సొంత డబ్బులు వెచ్చించారని సమాచారం. నాలుగు నెలలుగా వేతనాలు లేవని పంచాయితీ వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● జిల్లాలోని పలు తండా పంచాయతీల్లో నెలల తరబడి చెత్త పేరుకుపోతున్నదని తండావాసులు వాపోతున్నారు.

ట్రాక్టర్ల నిర్వహణ బాధ్యత పంచాయతీలదే

- సాయిబాబ, సంగారెడ్డి డీపీవో

ట్రాక్టర్ల నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీలదే. ప్రజల నుంచి వచ్చిన ఆస్తి పన్ను, ఇతర ఆర్థిక వనరులను సమకూర్చి డీజిల్, డ్రైవర్ల వేతనాలు, తాగునీటి సరఫరా, నర్సరీల్లో మొక్కల పెంపకం తదితర పనులకు వెచ్చించాలి. కొన్ని గ్రామ పంచాయతీలలో ట్రాక్టర్ల నిర్వహణ బాధ్యత కార్యదర్శులకు భారంగా మారిందన్న విషయం తమ దృష్టికి వచ్చింది. ఇప్పటికే ప్రభుత్వం నుంచి పల్లె ప్రగతి ద్వారా రూ.22.73 కోట్ల బకాయిలు రావాల్సి ఉందని, ఆ నిధులు రాగానే సర్దుబాటు చేస్తాం.

కనువిందుగా రేణుకా ఎల్లమ్మకు బోనాలు



కొల్చారంలో బోనాల ఊరేగింపులో మహిళలు

కొల్చారం, మే 10 (ఆంధ్రజ్యోతి): ఆదిశక్తి పరాశక్తి అయిన రేణుక ఎల్లమ్మ దేవికి లంద బోనం, గంగ బోనంతో పాటు కాటమయ్య బోనాలను సమర్పించారు. శనివారం మండల కేంద్రంలోని కొల్చారంలో గౌడసంఘం ఆధ్వర్యంలో ఐదో వార్షికోత్సవం పురస్కరించుకొని ఉదయం సిద్దిపేట ఒగ్గు కళాకారులచే గ్రామ పొలిమేరలోని ఎస్సీ కాలనీలో ఉన్న లందలో ఉన్న అమ్మవారికి ఘటంతో పాటు ఊరేగింపుగా వెళ్లి శ్రీరేణుకాఎల్లమ్మ కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ చివరలో ఉన్నటువంటి కోతుల చెరువు వద్దకు గంగబోనాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. ముందుగా కాటమయ్య బోనాన్ని పెద్దగౌడ్ ఇంటి నుంచి ఊరేగింపుగా డోలు చప్పులతో ఆటపాటలతో తీసుకొచ్చి కాటమయ్యకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘ సభ్యులతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

భక్తి భావంతోనే మానసిక ప్రశాంతత

● రంగంపేట పీఠాధిపతి మాధవానందసరస్వతి

వెల్దుర్తి, మే10(ఆంధ్రజ్యోతి): భక్తి భావంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతిస్వామి అన్నారు. శనివారం శని త్రయోదశి సందర్భంగా మండల పరిధిలోని బస్వాపూర్ శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో శనీశ్వరునికి తైలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్మాత్మిక చింతనతో ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందని, ప్రతి ఒక్కరూ భక్తి భావం అలవర్చుకోవాలని సూచించారు.

12 నుండి వెండికోల్‌లో ఎల్లమ్మ జాతర

పుల్‌కల్, మే 10 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలంలోని వెండికోలు గ్రామంలో వెలసిన అత్యంత పురాతన శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవత ఆలయ ఉత్సవాలు ఈ నెల 12వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు జరిగే జాతరకు ఘనంగా ఏర్పాట్లు చేశారు.

అల్లీపూర్‌లో మెథడిస్ట్ చర్చిలో జాతర



అల్లీపూర్‌లో ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, మే 10(ఆంధ్రజ్యోతి): దేవుని ఆశీర్వాదం పొందుటకు అందరం కలిసి ప్రత్యేక ప్రార్థనలను చేద్దామని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి జహీరాబాద్ పట్టణంలోని అల్లీపూర్‌లో మెథడిస్ట్‌సెంట్రల్ చర్చి ఆధ్వర్యంలో నిర్వహించే మెథడిస్ట్ 95వ జాతర ఉత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జాతరను మూడురోజుల పాటు నిర్వహిస్తారని తెలిపారు. కాగా శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 17మంది లబ్ధిదారులకు రూ.4.87విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, ఆయా మండలపార్టీల అధ్యక్షుడు తట్టునారాయణ, వెంకటేశం, నాయకులు పాల్గొన్నారు.

వారం గడిచినా విధుల్లో చేరని గిర్దావర్

● ఇబ్బందుల్లో చౌటకూర్ మండల ప్రజలు

పుల్‌కల్, మే 10 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ తహసీల్దార్ కార్యాలయంలో గిర్దావర్ లేక మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవలి వరకు ఇక్కడ కొండాపూర్ మండలం గిర్దావర్ మల్లంరాజు డిప్యూటేషన్‌పై విధులు నిర్వహించారు. ఆయన డిప్యూటేషన్‌ను రద్దు చేయడంతో తిరిగి కొండాపూర్ తహసీల్దార్ కార్యాలయ విధుల్లో చేరారు. ఇదే సమయంలో గుమ్మడిదల తహసీల్దార్ కార్యాలయంలో గిర్దావర్-2గా విధులు నిర్వహిస్తున్న కేటీ పవన్‌కుమార్‌ను చౌటకూర్ తహసీల్దార్ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై నియమిస్తూ ఈ నెల 3వ తేదీన జిల్లా అదనపు (రెవెన్యూ) కలెక్టర్ మాధురి ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు వెలువడి వారం రోజులు గడిచినా సదరు గిర్దావర్ పవన్‌కుమార్ విధుల్లో చేరలేదు. వారసత్వం, పౌతి మార్పు, కుల, ఆదాయ, నివాస, ఈబీసీ తదితర ధ్రువీకరణ పత్రాల జారీలో గిర్దావర్ విచారణ చేయాల్సి ఉంటుంది. వారం రోజులుగా గిర్దావర్ లేకపోవడంతో ప్రజలు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గిర్దావర్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

మత్తుపదార్థాలతో జీవితాలు నాశనం



తండాలో అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

నర్సాపూర్, మే 10(ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాలు, డ్రగ్స్ వాడకం వల్ల జీవితాలు నాశనమవడమే కాకుండా ఎన్నో దుష్పలితాలుంటాయని నర్సాపూర్ ఎక్సైజ్ ఇన్‌చార్జి సీఐ గోపాల్ పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్ మండలం సూర్యతండా, హరియా తండాలలో మత్తుపదార్థాలు, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ మత్తుపదార్థాలు, డ్రగ్స్ వాడినా, విక్రయించినా చటరీత్యా కూడా నేరమేనన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు అజీజ్, అరుణ సిబ్బంది పాల్గొన్నారు.

టీ మాదాపూర్ రేషన్‌షాపులో దొడ్డు బియ్యం పంపిణీ

చిన్నశంకరంపేట మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టీ మాదాపూర్ గ్రామంలో రేషన్‌షాప్‌కు సన్నబియ్యంకు బదులు దొడ్డు బియ్యం పంపిణీ చేశారు. ఈ క్రమంలో రేషన్‌షాప్ డీలర్ దొడ్డు బియ్యం పంపిణీ చేశారు. దొడ్డు బియ్యాన్ని ఎందుకు పంపిణీచేస్తున్నావని వినియోగదారులు ప్రశ్నించడంతో ప్రభుత్వం సరఫరా చేసిన బియ్యాన్ని పంపించేస్తున్నట్లు బదులిచ్చాడు. గ్రామానికి సన్నబియ్యాన్ని సరఫరా చేయాలని గ్రామస్థులు కోరారు.

చేతులు కోల్పోయిన కార్మికుడికి రూ.18లక్షల పరిహారం



బాధితుడి కుటుంబానికి చెక్కును అందజేస్తున్న యాజమాన్యం ప్రతినిధుల

పటాన్‌చెరు, మే 10(ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు పారిశ్రామిక వాడలోని అగర్వాల్ రబ్బర్స్ పరిశ్రమలో చోటు చేసుకున్న ప్రమాదంలో రెండు చేతులు కోల్పోయిన కార్మికుడి కుటుంబానికి యాజమాన్యం శనివారం రూ.18లక్షల పరిహారం అందించారు. పరిశ్రమలో పనిచేసే అభిషేక్ అనే కార్మికుడు ఇటీవల ప్రమాదంలో రెండు చేతులు కోల్పోయాడు. తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో కోలుకున్నాడు. రెండు చేతులు కోల్పోవడంతో కార్మికుడి కుటుంబం వీధిన పడింది. ఈ క్రమంలో యాజమాన్యంతో సీఐటీయా జిల్లా కార్యదర్శి రాజయ్య, యూనియన్ నాయకులు పలు దఫాలుగా చర్చించారు. ఈ మేరకు బాధిత కుటుంబానికి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పరిశ్రమ హెచ్‌ఆర్ మేనేజర్ కిషోర్‌శర్మ, యూనియన్ యజనరల్ సెక్రెటరీ రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

సృష్టిలో తల్లి ప్రేమను మించిన ప్రేమ లేదు



కండరాల క్షీణతతో బాధపడుతున్న బిడ్డలకు సేవ చేస్తున్న మాతృమూర్తులను సన్మానిస్తున్న నీలంమధు

పటాన్‌చెరు, మే 10(ఆంధ్రజ్యోతి): సృష్టిలో తల్లిప్రేమకు సాటిరాగల ప్రేమ మరొక్కటి లేదని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ నాయకుడు నీలంమధు ముదిరాజ్ అన్నారు. అంతర్జాతీయ మాతృ దినోత్సవం పురస్కరించుకుని ఇస్నాపూర్ రామాలయం ఆవరణలో కండరాల క్షీణత వ్యాధి బాధితుల సంఘం వ్యవస్థాపకుడు ఎం.రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి నీలంమధు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దురదృష్టవశాత్తు తాను తల్లిదండ్రులను ఒక రోజు వ్యవధిలో ఇద్దరినీ కోల్పోవడం తన జీవితంలో మరిచిపోలేని విషాదమని గుర్తు చేసుకున్నారు. కండరాల క్షీణతతో బాధపడే తల్లులు, బిడ్డల కోసం శక్తివంచనలేకుండా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ ఏపీడీ జంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ గడ్డంశ్రీశైలం, ఉపాధ్యాయురాలు శిరీష, నాయకులు మెట్టుశ్రీధర్, శ్రీనివాస్, నారాయణరెడ్డి, మన్నెరాఘవేంద్ర, దివ్యాంగులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గడువులోగా 'భూ భారతి' అమలుకు కృషి

● సెలవు రోజులోనూ పనుల్లో నిమగ్నమైన రెవెన్యూ అధికారులు



తహసీల్దార్ కార్యాలయంలో శనివారం పనుల్లో నిమగ్నమైన రెవెన్యూ అధికారులు,సిబ్బంది

కొండాపూర్,మే10(ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టం అమలును నిర్దేశిత సమయంలో అమలు చేసేందుకు రెవెన్యూ అధికారులు ప్రణాళికాబద్ధంగా పనులను కొనసాగిస్తున్నారు. శనివారం ప్రభుత్వ సెలవు దినం అయినప్పటికీ గడువులోగా భూ సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు పనుల్లో నిమగ్నమైమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం ప్రతిష్టాత్మకంగా భూ భారతి చట్టంను అమల్లోకి తీసుకొని కొండాపూర్ మండలం రెవెన్యూ గ్రామాలను పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసింది. రాష్ట్రవాప్తంగా భూ భారతి చట్టాన్ని సమగ్రంగా అమల్లోకి తెచ్చేందుకు రెవెన్యూ శాఖ అధికారుల సెలవు రోజుల్లో సైతం పనుల్లో నిమగ్నమై సమస్యల పరిష్కారం దిశగా ముందుకు సాగుతున్నారు. 10 రెవెన్యూ గ్రామలలో ఇప్పటి వరకు జరిగిన రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను గడువుకు ముందే పరిష్కరించేందుకు అవసరమయ్యే చర్యలకు భూ రికార్డుల ప్రకారం పనులు కొనసాగిస్తున్నారు. నిబంధనలకు లోబడి రైతుల భూ సమస్యలను పరిష్కరించేలా పనులను ప్రారంభించినట్లు మండల రెవెన్యూ తహసీల్దార్ అశోక్ తెలిపారు. త్వరలో జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ లబ్ధిదారులకు సమస్యల పరిష్కారానికి సంబంధించిన పత్రాలను అందించనున్నట్లు తెలుస్తున్నది.

రేషన్‌కార్డుల్లో పొరపాట్లపై ప్రజల ఆగ్రహం

మనోహరాబాద్ మే 10 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా కొత్త రేషన్‌కార్డుల జారీ చేయకపోవడంతో, పాత రేషన్ కార్డులో కుమారులు, కూతుర్ల పెళ్లిళ్ల జరిగినా వారి పేర్లు మాత్రం అలాగే ఉండిపోయాయి. పేర్లను తొలగించడం గానీ, కొత్త పేర్లను చేర్చడం గానీ చేయలేదు. ప్రజాపాలనలో భాగంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్న సిబ్బంది ఒకరి పేరుకు బదులుగా మరొకరి పేరును తొలగించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాళ్లకల్ గ్రామానికి చెందిన కొమ్ము శివలక్ష్మి పేరు రేషన్ కార్డు నుంచి కుమారుడు కొమ్ము సురేష్ పేరును తొలగించాలని దరఖాస్తు చేసుకోగా, తల్లి కొమ్ము శివలక్ష్మి పేరునే తొలగించారు. దీంతో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోనాయపల్లి గ్రామానికి చెందిన మరో వ్యక్తికి ఇలాంటి సమస్యే ఎదురైందని స్థానిక ప్రజలు ఆంధ్రజ్యోతి' ఎదుట తమ గోడును వెళ్లగక్కారు.

ధ్యాన్యం కొనుగోలులో జాప్యం జరగొద్దు

కొండాపూర్, మే10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రైతుల నుంచి సేకరిస్తున్న ధాన్యం కొనుగోలులో జాప్యం జరుగవద్దని కొండాపూర్ మండల తహసీల్దార్ అశోక్ పీఏసీఎస్ సిబ్బందికి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని కొండాపూర్ పీఏసీఎస్ వరి,జొన్న కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి సమస్యలపై అరా తీశారు.